నూతన వధూవరులకు
కేసీఆర్ దంపతుల ఆశీర్వాదం

గజ్వేల్, ఫిబ్రవరి 17: 'నమస్తే తెలంగాణ' దినపత్రిక సంపాదకులు తిగుళ్ల కృష్ణమూర్తి, శ్రీలత దంపతుల కుమారుడు శ్రీకర కపర్దిశర్మ వివాహం గౌరీభట్ల శారదాప్రసాద్, విరజ దంపతుల కూతురు మనస్వినితో ఆదివారం సిద్దిపేటలో అంగరంగ వైభవంగా జరిగింది. వారి కుటుంబం సోమవారం మర్కూక్ మండలం పాములపర్తి సమీపంలో నిర్వహించిన శ్రీరమాసహిత సత్యనారాయణ స్వామి వ్రతంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, శోభ దంపతులు పాల్గొని నవ దంపతులను ఆశీర్వదించారు. సంప్రదాయ పద్ధతిలో పూలు, పండ్లు అందించి పట్టువస్త్రాలు బహూకరించారు. సోమవారం కేసీఆర్ పుట్టినరోజు కావడంతో, ఈ కార్యక్రమానికి వచ్చిన బ్రాహ్మణోత్తములు, వేద పండితుల అభ్యర్థన మేరకు కేసీఆర్ దంపతులు దండలు, ఉంగరాలు మార్చుకున్నారు. వేదమంత్రాలతో వారికి వేదపండితులు ఆశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా తిగుళ్ల కృష్ణమూర్తి దంపతులు ఇచ్చిన ఆతిథ్యాన్ని కేసీఆర్ దంపతులు స్వీకరించారు. తమ ఆహ్వానం మేరకు కార్యక్రమానికి హాజరైన కేసీఆర్ దంపతులకు తిగుళ్ల కృష్ణమూర్తి దంపతులు ధన్యవాదాలు తెలిపారు. కేసీఆర్ పుట్టినరోజును పురస్కరించుకొని వృక్షార్చనలో భాగంగా పాములపర్తి సమీపంలో నవ దంపతులు మాజీ ఎంపీ సంతోష్‌కుమార్‌తో కలిసి మొక్కనాటి నీళ్లుపోశారు. కార్యక్రమాల్లో మాజీమంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, సీనియర్ సంపాదకులు రామచంద్రమూర్తి, సీఎం మాజీ సీపీఆర్‌వో వనం జ్వాలా నర్సింహారావు, బుద్ధవనం మాజీ ఓఎస్డీ మల్లేపల్లి లక్ష్మయ్య, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, గజ్వేల్ ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, మర్కూక్ కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మర్కూక్ మండలం పాములపర్తిలో నిర్వహించిన శ్రీరమాసహిత సత్యనారాయణస్వామి వ్రతంలో నవ దంపతులను ఆశీర్వదిస్తున్న తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, శోభ దంపతులు. చిత్రంలో 'నమస్తే తెలంగాణ' ఎడిటర్ తిగుళ్ల కృష్ణమూర్తి దంపతులు

ఐఏఎస్‌లు తప్పు చేయాలని
ముఖ్యమంత్రే అంటారా?

- రాష్ట్ర మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేల మధ్య చీలిక
- మంత్రులు ప్రతి పనికి 15% కమిషన్ దండుకుంటున్నరు
- ముస్లింలను బీసీ జాబితా నుంచి తొలగించాలి: సంజయ్

విద్యానగర్, ఫిబ్రవరి 17: రాష్ట్రంలో సీఎం రేవంత్ వ్యవహరిస్తున్న తీరును చూస్తుంటే ప్రభుత్వం ఉంటుందో ఊడుతుందో తెలియని పరిస్థితి నెలకొందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ వ్యాఖ్యానించారు. ఒక్కతప్పు చేయాలని అంటే, ఐఏఎస్‌లు మూడు తప్పులు చేస్తున్నారని సీఎం వ్యాఖ్యానించడం సిగ్గు చేటన్నారు. సీఎంగా ఉంటూ అవినీతిని నిరోధించాల్సింది పోయి తప్పులు చేయాలని చెప్పడమేంటని ప్రశ్నించారు. రాష్ట్రంలో మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేల మధ్య చీలిక వచ్చిందన్నారు. కొందరు మంత్రులు ప్రతి పనికి 15 శాతం కమీషన్లు దండుకుంటున్నారని విమర్శించారు. 56 వేల నిరుద్యోగభృతి, మహిళకు స్కూటీ, తులం బంగారం, పీఆర్సీ, 4 డీఏలు, రైతుభరోసా, బోనస్, రుణమాఫీ బాకీ పడిందని వివరించారు. టీచర్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో సోమవారం కరీంనగర్‌లోని కొండా సత్యలక్ష్మీ గార్డెన్ లో ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల్లోని బీజేపీ మండలాధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడారు. బీసీ జాబితాలో ముస్లింలను చేర్చి బిల్లు పంపితే కేంద్రం ఎట్లా ఆమోదిస్తుందని ప్రశ్నించారు. ముస్లింలను బీసీల్లో కలిపి, క్రైస్తవులకు ఎస్సీ సర్టిఫికెట్లు ఇచ్చి అన్యాయం చేస్తున్నా బీసీ, ఎస్సీ సంఘాలు ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు.

కొత్త రేషన్‌కార్డులు జారీ చేయండి
అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 17(నమస్తే తెలంగాణ): కొత్త రేషన్ కార్డుల జారీకి ఏర్పాట్లు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రజాపాలన, గ్రామసభలు, మీసేవా కేంద్రాల ద్వారా వచ్చిన దరఖాస్తులు, కులగణన వివరాల ద్వారా అర్హులను ఎంపిక చేయాలని సూచించారు. హైదరాబాద్‌లో సోమవారం రేషన్‌కార్డుల జారీపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అర్హులందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలని చెప్పారు. ఎన్నికల కోడ్ అమలులో లేని జిల్లాల్లో ముందుగా, కోడ్ ముగిసిన తర్వాత అన్ని జిల్లాల్లో కార్డులు జారీ చేయాలని సూచించారు.

భవిష్యత్తులో బీసీయే కాంగ్రెస్ సీఎం
టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్

హైదరాబాద్, ఫిబ్రవరి 17 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో ఐదేండ్ల తర్వాత కాంగ్రెస్ నుంచి బీసీ ముఖ్యమంత్రి అవుతాడని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. గాంధీభవన్‌లో సోమవారం జరిగిన పార్టీ సోషల్ మీడియా కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఏడో ఒక రోజు తెలంగాణలో బీసీ అభ్యర్థి సీఎం అవుతారని, అది కాంగ్రెస్ పార్టీ నుంచేనని పేర్కొన్నారు. ఈ ఐదేండ్లు రేవంత్‌రెడ్డే రాష్ట్ర సీఎంగా ఉంటారని చెప్పారు.

హైడ్రా చర్యలు చట్టవ్యతిరేకం

- నోటీసులు ఇచ్చిన 24 గంటల్లోనే కూల్చివేతలా?
- ఇది న్యాయసూత్రాలకు విరుద్ధం
- హైడ్రా తీరును తీవ్రంగా తప్పపట్టిన హైకోర్టు
- కోర్టుకు హాజరుకావాలని ఇన్‌స్పెక్టర్‌కు ఆదేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 17(నమస్తే తెలంగాణ): ప్రభుత్వ భూమి, చెరువుల రక్షణ పేరిట హైడ్రా చేపట్టిన కూల్చివేతలు చట్టవ్యతిరేకంగా, సహజ న్యాయసూత్రాలకు విరుద్ధంగా ఉన్నాయని హైకోర్టు వ్యాఖ్యానించింది. నోటీసులు ఇచ్చిన 24 గంటల్లోనే కూల్చివేతలు చేపట్టడాన్ని హైకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. ఒక్క రోజే నోటీసు ఇవ్వడం, విచారణ చేపట్టడం, అదీ రెండో శనివారం కావడం, ఆ తర్వాత ఆదివారం కూల్చివేతలు చేపట్టడం హైడ్రాకు పరిపాటిగా మారిందని ఆక్షేపించింది. గతంలో ఇదే హైకోర్టు ఫుల్ బెంచ్ ఇచ్చిన తీర్పునకు ఈ వైఖరి విరుద్ధమని పేర్కొన్నది. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువు మండలం ముత్తంగిలోని తన స్థలానికి సంబంధించి సమర్పించిన వివరాలను పరిశీలించకుండానే అందులోని షెడ్డును కూల్చివేయడాన్ని సవాలు చేస్తూ ఏ ప్రవీణ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను సోమవారం న్యాయమూర్తి జస్టిస్ కే లక్ష్మణ్ విచారించారు. పార్కు స్థలంలో నిర్మాణాలు చేపడుతున్నారని హైడ్రా నోటీసులు జారీ చేసిందని, దీనికి సమాధానంగా భూమార్పిడి ప్రొసీడింగ్స్, సేల్ డీడ్, పంచాయతీ అనుమతులు వంటి వివరాలను హైడ్రాకు సమర్పించినట్టు పిటిషనరు తరపు న్యాయవాది తెలిపారు. వివరాలను పరిశీలించకుండా, ఫిర్యాదు చేసిన వారితోపాటు పిటిషనర్‌ను పిలిచి విచారణ చేపట్టకుండా ఏకపక్షంగా షెడ్డును కూల్చివేశారని పేర్కొన్నారు.

కోర్టు ఆదేశాలు ఎందుకు అమలు చేయడం లేదు?

నోటీసులు ఇచ్చిన తర్వాత, పత్రాలు సమర్పించడానికి హైడ్రా 24 గంటలు కూడా సమయం ఇవ్వడం లేదని విచారణ సందర్భంగా ధర్మాసనం తీవ్రంగా తప్పుపట్టింది. ముందురోజు నోటీసు ఇచ్చి, తర్వాత రోజుకే గడువు ఇచ్చి, ఆ వెంటనే కూల్చివేయడం సహజ న్యాయసూత్రాలకు విరుద్ధమని వ్యాఖ్యానించింది. హైడ్రా ప్రొసీడింగ్స్ ప్రజలకు వ్యతిరేకంగా ఉన్నాయని పేర్కొన్నది. సహజ న్యాయసూత్రాలకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఎలాగని, హైకోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాలు ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించింది. ముత్తంగిలో షెడ్డు కూల్చివేతపై వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలని హైడ్రా ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్‌ను ఆదేశిస్తూ.. కేసు విచారణను ఈనెల 20కి వాయిదా వేసింది.

మీ వైఫల్యానికి మాదా బాధ్యత?

మొదటిపేజీ తరువాయి...

చెయ్యాలని చెప్తే.. మూడు తప్పులు చేద్దామంటున్నరని అనడం ఏమిటి? ఎన్ని తప్పులు చేశామో? ఎక్కడ చేశామో? చూపించండి.. మీ రాజకీయ అసమర్థతను మాపై నెట్టాలని చూస్తారా?' అంటూ తీవ్ర అసహనం వ్యక్తంచేసినట్టు సమాచారం. తాము ఏమీ చేయకుండానే ప్రభుత్వం, పాలన నడుస్తున్నదా? అని, ఎంత కష్టపడినా ఇంతేనా, ప్రయోజనం లేదా? అని ఆవేదన వ్యక్తం చేసినట్టు తెలిసింది.

అందుకేనా అసంతృప్తి?

సివిల్ సర్వెంట్స్‌పై సీఎం రేవంత్ వ్యాఖ్యలు రాజకీయ, అధికారవర్గాల్లో చర్చకు దారితీశాయి. ఐఏఎస్, ఐపీఎస్‌లపై ఆయన పట్టు కోల్పోయారని, ఆయన మాటలను ఎవరూ ఖాతరు చేయడం లేదని, అందుకే తన అసంతృప్తిని వెళ్లగక్కినట్టు తెలుస్తున్నదని గుసగుసలు వినిపిస్తున్నాయి. సీఎం స్థాయిలో ఉన్న వ్యక్తి ఐఏఎస్, ఐపీఎస్‌లపై ఇలాంటి వ్యాఖ్యలు ఎందుకు చేయాల్సి వచ్చిందనే అంశంపైనా ఆరాలు తీస్తున్నారు. ఆదివారం రిటైర్డ్ ఐఏఎస్ అధికారి గోపాలకృష్ణ రచించిన పుస్తకావిష్కరణలో సీఎం ఐఏఎస్, ఐపీఎస్‌లపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఐఏఎస్, ఐపీఎస్‌లు ఏసీ రూముల్లోంచి బయటకు రావటం లేదని, మాట వినడం లేద ని, సెటిల్‌మెంట్స్ చేస్తున్నారని మాట్లాడారు.

సర్వత్రా విమర్శలు

వాస్తవానికి ప్రభుత్వం, పాలనలో ఐఏఎస్, ఐపీఎస్‌లది అత్యంత కీలకపాత్ర. అలాంటి వారిపై సీఎం స్థాయిలో ఉన్న వ్యక్తి వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొంతకాలంగా ఐఏఎస్, ఐపీఎస్‌లకు సీఎం రేవంత్‌కు మధ్య పొసగడం లేదనే చర్చ రాజకీయ వర్గాల్లో జరుగుతున్నది. ఇందులో భాగంగానే సీఎం అధికారులపై అసంతృప్తితో ఉన్నట్టు చర్చించుకుంటున్నారు. క్షేత్రస్థాయిలోకి వెళ్లాలని తాను పదే పదే చెప్పినా, సీఎస్‌తో చెప్పించినా ప్రయోజనం లేదని ఆయనే స్వయంగా వెల్లడించారు. ఐఏఎస్, ఐపీఎస్‌లపై ఆయన కోపంగా ఉన్నట్టు తేలిపోయింది. వీరిపై కోపం తీర్చుకునేందుకు సీఎంకు పుస్తకావిష్కరణ వేదికగా లభించిందనే చర్చ నడుస్తున్నది. అందుకే సీనియర్ బ్యూరోక్రాట్స్, రిటైర్డ్ బ్యూరోక్రాట్స్ అంతా ఒకచోట ఉండగానే సివిల్ సర్వెంట్స్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులపై తనలో నెలకొన్న అసంతృప్తిని, కోపాన్ని తీర్చుకున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

- హెచ్చరించినా పట్టించుకోని నిర్మాణదారులు
- నోటీసులు ఇవ్వకుండా నేలమట్టం చేసిన అధికారులు

గద్వాలలోని బసవన్న చౌరస్తాలో అక్రమ కట్టడాన్ని జేసీబీతో కూల్చివేయిస్తున్న అధికారులు

గద్వాల టౌన్, ఫిబ్రవరి 17 : జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని బసవన్న చౌరస్తా వద్ద నిర్మించిన దుకాణ సముదాయాన్ని మున్సిపల్ అధికారులు సోమవారం నేలమట్టం చేశారు. ప్రజాప్రయోజనాల కోసం ఉపయోగించాల్సిన పది శాతం స్థలంలో కొందరు అక్రమంగా దుకాణాలను నిర్మించగా.. మున్సిపల్ అధికారుల ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే కట్టడాలను కూల్చివేశారు. ప్రభుత్వ స్థలాల్లో, పది శాతం స్థలాలో అక్రమ నిర్మాణాలు చేపట్టినా.. డబ్బాలు ఏర్పాటు చేసినా చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ దశరథ్ హెచ్చరించారు. నోటీసులు, సమాచారం లేకుండానే కూల్చివేస్తామన్నారు.

ప్రణాళిక సంఘం సలహా కమిటీ నియామకం
ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

హైదరాబాద్, ఫిబ్రవరి 17 (నమస్తేతెలంగాణ) : తెలంగాణ అభివృద్ధి ప్రణాళిక సంఘం (టీజీడీపీఎస్) సలహా కమిటీని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు సోమవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కమిటీ చైర్మన్‌గా ఉప ముఖ్యమంత్రి, ప్రణాళికశాఖ మంత్రిగా వ్యవహరిస్తారు. కమిటీ సభ్యులుగా ప్రొఫెసర్లు కంచె ఐలయ్య, శాంతిసిన్హా, హిమాన్షు, భూక్యా, పురుషోత్తంరెడ్డి, డాక్టర్ సుఖదేవ్ థారోట్, నిఖిల్ దేవ్, ప్రవీణ్ చక్రవర్తిలను నియమించారు. ఈ సలహా సంఘం రాష్ట్ర ఆర్థిక, సామాజిక, వివిధ రంగాలలో సలహాలు, సూచనలు అందించనుంది.

శిగమూగిన పెద్దగట్టు

సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం పెద్దగట్టు లింగమంతులస్వామి జాతరకు భక్తులు పోటెత్తారు. జాతర ప్రాంగణం కోలాహలంగా మారింది. మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ దంపతులు స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు. –సూర్యాపేట

- సీఎంఆర్ఎఫ్‌కు రిటైర్డ్ టీచర్ లక్ష విరాళం

జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం కోయిలదిన్నెకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు, రైతు గోరంట్ల లక్ష్మీకాంతరెడ్డి సీఎంఆర్ఎఫ్‌కు లక్ష విరాళంగా అందజేశారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సంతోష్‌ను కలిసి రైతుభరోసా ద్వారా జమైన రూ.95,400కు రూ.4,600 జోడించి రూ.లక్ష చెక్కును అందజేశారు. లక్ష్మీకాంతరెడ్డిని కలెక్టర్ అభినందించారు. –గద్వాల

టన్ను ఇసుక 2 వేలు!

- వినియోగదారులకు ఇబ్బందులు
- ప్రభుత్వ విధానాల ఫలితమేనని నిర్మాణరంగ నిపుణుల ఆగ్రహం

హైదరాబాద్, ఫిబ్రవరి 17 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వం తీసుకొచ్చిన ఇసుక విధానం ప్రతికూల ఫలితాలు ఇస్తున్నదని నిర్మాణరంగ నిపుణులు మండిపడుతున్నారు. ప్రభుత్వం తీరు.. కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడినట్టుగా ఉందని విమర్శిస్తున్నారు. ప్రభుత్వంలోని వివిధ శాఖల అధికారులు మూకుమ్మడిగా ఇసుక లారీలపై దాడులకు దిగడంతో ఇసుకకు కృత్రిమ కొరత ఏర్పడి ధరలు అమాంతం పెరిగిపోయాయని చెప్తున్నారు. ఇసుక ధర పెరగకుండా నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాల్సిన అధికారులు అనాలోచితంగా లారీలకు జరిమానాలు విధించడమే పనిగా పెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. గతంలో రూ.1200 వరకు లభించిన టన్ను ఇసుక కొన్ని రోజులుగా రూ.1800–2000లకు చేరుకున్నదని, ప్లాస్టరింగ్‌కు ఉపయోగించే ఫైన్‌శాండ్ రూ.2100 పలుకుతున్నదని వాపోతున్నారు. రియల్ ఎస్టేట్ రంగంలో స్తబ్ధత నెలకొనగా, ఇసుక ధరలు పెరగడంతో నిర్మాణరంగం మరింత కుదేలైందని చెప్తున్నారు.

ముందస్తు చర్యలు ఎక్కడ?

ఇసుక అక్రమ రవాణాను అరికడుతామని చెప్తున్న అధికారులు కొరత ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిందని నిపుణులు చెప్తున్నారు. అలా వ్యవహరిస్తే ఇసుక రవాణా సజావుగా సాగడంతోపాటు ధరలు నియంత్రణలో ఉండేవని అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. క్వారీల వద్ద ఓవర్ లోడింగ్ జరగకుండా చూడడం, అక్రమ క్వారీలను మూసివేయడం, ఎగ్జిట్ పాయింట్‌ల వద్ద వేబిల్లులు తనిఖీ చేస్తే సరిపోయేదని వివరిస్తున్నారు. కానీ అధికారులు ఇసుక లారీలు రోడ్లపైకి వచ్చాక తనిఖీలు, జరిమానాల విధింపు పేరుతో హడావుడి చేయడం వల్లే లారీల యజమానులు రవాణాను నిలిపివేశారని చెప్తున్నారు.

వెయ్యికి ఇచ్చే అవకాశమున్నా!

టీజీఎండీసీ అన్ని పన్నులూ కలుపుకొని టన్ను ఇసుకకు సుమారు రూ.400 వరకు వసూలు చేస్తున్నది. ఈ ప్రకారం 35 టన్నుల ఇసుక లారీకిగాను టీజీఎండీసీకి రూ.14000 చెల్లించాల్సి ఉంటుంది. రాష్ట్రంలోని ఏ ఇసుక క్వారీ నుంచి హైదరాబాద్‌కు ఇసుకను రవాణా చేసినా రూ.15000 కన్నా ఎక్కువ ఖర్చయ్యే అవకాశంలేదని నిర్మాణదారులు చెప్తున్నారు. టోల్‌ట్యాక్స్‌లు, లేబర్ ఖర్చులు మరో రూ.6000 అయినా 35 టన్నుల ఇసుకను వినియోగదారుడికి రూ.35000 అందించే అవకాశముందని అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టి, ధరలు అదుపు చేయాలని కోరుతున్నారు.

ఇసుక ధరలు తగ్గించేందుకు చర్యలు

కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన బిల్లులు రూ.580 కోట్లను దశలవారీగా చెల్లిస్తాం. ఇకనుంచి కాంట్రాక్టర్లకు బిల్లులు నెల నెలా చెల్లిస్తాం. ఓవర్‌లోడింగ్‌ను అరికట్టేందుకు క్వారీల వద్ద వేబ్రిడ్జీలు, సీసీ కెమేరాలు ఏర్పాటు చేస్తాం. వినియోగదారులకు టన్ను ఇసుకను రూ.1600కు అందించేందుకు చర్యలు తీసుకుంటాం. ఇసుక అక్రమ రవాణాపై 9848094373, 7093914343 నంబర్లకు సమాచారం ఇవ్వవచ్చు.

–శ్రీధర్,
గనులశాఖ ముఖ్య కార్యదర్శి

జీతం రాలేదని ఆత్మహత్యాయత్నం

- వికారాబాద్ జిల్లాలో ఘటన
- జిల్లా ప్రభుత్వ దవాఖానలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న బాధితుడు

యాలాల, ఫిబ్రవరి 17: జీతం రాలేదని మనస్తాపంతో సెక్యూరిటీ గార్డ్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ ఘటన వికారాబాద్ జిల్లా తాండూరులో చోటుచేసుకున్నది. బాధితుడి వివరాల ప్రకారం.. పాత తాండూరుకు చెందిన నర్సింహులు 20 ఏండ్లుగా జిల్లా ప్రభుత్వ దవాఖానలో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్నాడు. నాలుగు నెలల జీతంలో రెండు నెలల జీతం మాత్రమే రావడం, పీఎఫ్ డబ్బులు అడిగితే ఇవ్వకపోవడం, కూతురు వివాహానికి అడ్డంకిగా ఆర్థిక సమస్యలు తలెత్తడంతో సోమవారం ఇంటివద్ద పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతను పనిచేస్తున్న దవాఖానకు తరలించారు. ప్రస్తుతం అతని ఆరోగ్యం మెరుగ్గానే ఉన్నట్టు వైద్యులు తెలిపారు. జీతం విషయమై గతంలో ఓ సెక్యూరిటీ గార్డ్ కూడా ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.

శ్రీవారి భక్తులకు అలర్ట్
నేటి నుంచి 24వరకు ఆన్‌లైన్‌లో టికెట్ల విడుదల

హైదరాబాద్, ఫిబ్రవరి 17 (నమస్తేతెలంగాణ): తిరుమల శ్రీవారి మేనెల దర్శనానికి సంబంధించిన టికెట్లు విడుదల చేయడానికి తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) సిద్ధమైంది. మంగళవారం ఉదయం 10 గంటలకు లక్కీడిప్ విధానంలో కేటాయించే ఆర్జిత సేవతోపాటు ఈనెల 24వరకు జరిగే అన్ని కార్యక్రమాలకు సంబంధించి టికెట్లను విడుదల చేయన్నుట్టు టీటీడీ వెల్లడించింది.

టీటీడీ చైర్మన్ డీపీతో మోసం

టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ఫొటో వాట్సాప్ డీపీగా పెట్టిన ఓ కేటుగాడు.. భక్తులనుంచి అందినకాడికి డబ్బు దోచుకున్నాడు. వీఐపీ బ్రేక్ దర్శనం, సుప్రభాత సేవ, ఆర్జిత టికెట్లు అందుబాటులో ఉన్నాయని, కావాల్సిన వారు తనను సంప్రదించాలని వాట్సాప్ గ్రూపులో పోస్టులు పెట్టాడు. ప్రొఫైల్ పిక్ టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ఫొటో ఉండటంతో నిజమని నమ్మి నిండా మునిగారు. విషయాన్ని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు దృష్టికి తీసుకెళ్లగా... కేటుగాడి బాగోతం బయటపడింది. ఫోన్ నంబర్ ఆధారంగా మోసాలకు పాల్పడుతున్న వ్యక్తిని హైదరాబాద్ ఓల్డ్ సిటీకి చెందిన మహ్మద్ ఖాన్‌గా గుర్తించారు. ఈఘటనపై సమగ్ర విచారణ జరిపి, కఠిన చర్యలు తీసుకోవాలని విజిలెన్స్, పోలీసు అధికారులను టీటీడీ చైర్మన్ ఆదేశించారు.

ఏటా రోడ్లపైకి 10 లక్షల కొత్త వాహనాలు
రాష్ట్రంలో మొత్తం వాహనాల సంఖ్య 1.72 కోట్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 17 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో వాహనాల సంఖ్య గణనీయంగా పెరిగింది. పదేండ్లలో ఏటేటా సగటున 10 లక్షల కొత్త వాహనాలు రోడ్లపైకి వస్తున్నాయి. తెలంగాణలో మొత్తం వాహనాల సంఖ్య 1.72 కోట్లకు చేరింది. రాష్ట్రం ఏర్పాటయిన 2014 జూన్ 2 నాటికి తెలంగాణలో 71.52 లక్షల వాహనాలు ఉండగా పదేండ్లలో కొత్తగా కోటి వాహనాలు రోడ్లపైకి వచ్చాయి. వాహనాల కొనుగోలుకు బ్యాంకులు పెద్దమొత్తంలో రుణాలు ఇవ్వడం, చిరుద్యోగులు ఉద్యోగం రాగానే వెంటనే వాహనాలు కొనుగోలు చేస్తున్నారు. మధ్య తరగతి ప్రజలు కూడా ద్విచక్రవాహనాలతో పాటు కార్ల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. జనాభాలో సగటున ఇద్దరిలో ఒకరికి వాహనం ఉన్నట్టు రవాణా శాఖ అధికారులు చెప్తున్నారు. తెలంగాణలో అత్యధికంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోనే 82.45 లక్షల వాహనాలు.. అంటే రాష్ట్రంలోని 50 శాతం వాహనాలు అక్కడే రిజిస్ట్రేషన్ అయ్యాయి. అత్యల్పంగా ములుగు జిల్లాలో 53,430 వాహనాలు, ఆ తర్వాత భూపాలపల్లి జిల్లాలో 80,010, ఆసిఫాబాద్ జిల్లాలో 88,768 ఉన్నాయి.

తెలంగాణలో వాహనాల సంఖ్య

	2014	2024
ద్విచక్ర వాహనాలు	52,99,642	1,26,98,287
కారు	8,84,870	23,09,244
ట్రాక్టర్లు, ట్రైలర్లు	2,69,311	7,64,762
సరకు రవాణా వాహనాలు	3,28,863	6,46,954
ఆటో రిక్షాలు	2,36,531	5,09,495
మ్యాక్సీ క్యాట్లు	55,877	1,68,471
విద్యా సంస్థల బస్సులు	19,803	32,047
ప్రైవేటు బస్సులు	3,337	10,668
ఈ రిక్షాలు	0	298
ఇతర వాహనాలు	54,569	1,05,672
మొత్తం వాహనాలు	71,52,803	1,72,45,898

బడ్జెట్ కూర్పుపై సర్కారు మల్లగుల్లాలు

- శాఖలవారీగా సీఎం రేవంత్, మంత్రుల వరుస సమీక్షలు
- నేటికీ ప్రాధాన్యతా పథకాలను తేల్చని సర్కారు

హైదరాబాద్, ఫిబ్రవరి 17 (నమస్తే తెలంగాణ): 'తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ 2025–26' కూర్పుపై ప్రభుత్వం అపసోపాలు పడుతున్నది. గడువు సమీపిస్తున్నా ప్రభుత్వం ఇప్పటివరకు ప్రాధాన్యత రంగాలను గుర్తించలేకపోతున్నది. దీంతో ఏ శాఖకు కేటాయింపులు పెంచాలి? ఏశాఖ కేటాయింపుల్లో కోత పెట్టాలో అర్థంకాక మల్లగుల్లాలు పడుతున్నది. సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క వరుసగా ఉన్నత స్థాయి సమీక్షలు చేస్తున్నారు. బుధవారం ఆర్థిక శాఖపై సీఎం సమీక్ష జరపగా, గురువారం భట్టి విక్రమార్క ఆర్‌అండ్‌బీ, బీసీ సంక్షేమ శాఖ, రవాణాశాఖల ప్రీ బడ్జెట్ సమావేశాలు నిర్వహించారు. ఆయాశాఖలకు సంబంధించి చేపట్టాల్సిన పనులు, అందుకు అయ్యే నిధులపై చర్చించారు. అయినా ఇప్పటివరకు బడ్జెట్ కూర్పుపై ప్రభుత్వం తుది అంచనాలకు రాలేదని ఆర్థిక శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. గతంలో ఇరిగేషన్, విద్య, వైద్యం, వ్యవసాయం.. ఇలా ఏటా ఒకటి రెండు ప్రాధాన్యత అంశాలను ప్రభుత్వం ఎంచుకుని.. ఆయా శాఖలకు నిధులు ఎక్కువగా కేటాయించి, మిగతా శాఖలకు సర్దుబాటు చేసేది. నిరుడు ప్రభుత్వం రూ.2,91,149 కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టి.. అందులో సంక్షేమానికే ఎక్కువ నిధులు కేటాయించి, మూలధన వ్యయం కింద కేటాయింపులు తగ్గించింది. దీంతో ఏ రంగానికీ ప్రాధాన్యం ఇవ్వలేకపోయింది.

ఆలస్యంగా బడ్జెట్..

కొన్నేండ్లుగా బడ్జెట్‌ను ఫిబ్రవరిలోనే ప్రవేశపెట్టే ఆనవాయితీ కొనసాగుతున్నది. అయితే 2025–26 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌పై ఇప్పటివరకు ప్రభుత్వం ఒక అంచనాకు రాలేదని తెలుస్తున్నది. అధికారులు ప్రాథమిక బడ్జెట్ ముసాయిదాను పూర్తి చేశారని, తుది సమీక్షల కోసం ఎదురుచూస్తున్నారని సమాచారం. దీంతో ఈ ఫిబ్రవరిలో ప్రవేశపెట్టే అవకాశం లేదని స్పష్టమవుతున్నది. మార్చి రెండోవారంలో ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు సమాచారం. బడ్జెట్‌పై రెండుమూడు నెలల ముందు నుంచి సన్నాహాలు జరపాల్సి ఉంటుందని అధికారులు తెలుపుతున్నారు. కనీసం డిసెంబర్ రెండోవారం నుంచి ప్రారంభిస్తే ఫిబ్రవరిలో ప్రవేశపెట్టే అవకాశం ఉండేదని చెబుతున్నారు. కానీ